# మీ స్వరమే ఉపాధికి సోపానం !

## వాయిస్ ఓవర్ 65వ కళకు ఊపిరి..



**మాటే మంత్రము... అన్నాడొక సినీ కవి. తరచి చూస్తే ఇందులో గొప్ప పరమార్ధం ఉందనే అనిపిస్తోంది. వాక్ శుద్ధి అన్న మాట కూడా ఉంది. వాచకం గురించి శ్రేష్టమైన పలుకుబడికి ఉండే ఆదరణ, దానికి లభించే ఖ్యాతి అనన్య సామాన్యం. కొందరు మాట్లాడుతుంటే అదే పనిగా వినబుద్ధి అవుతుంది. అందుకే అన్నారు పెదలు వాక్ చాతుర్యం ఉంటే ఎంతటి కార్యమైనా సులభంగా సాధించుకు రావచ్చని. ఈ సూత్రమే ఆధునిక కాలంలో వాయిస్ ఓవర్ అనే అరవై అయిదో కళకి ఊపిరి పోసిందనేది చెప్పకనే చెప్పొచ్చు.**



మాట అనేది గొంతు నుంచి వచ్చే ఒకానొక స్వర ముద్ర. అది వినసొంపుగా ఉండాలి. అర్ధవంతంగా ఉండాలి. సందర్భశుద్ధి కలిగి ఉండాలి. అప్పుడే వీనులకి మంజుల నాధంగా మారుతుంది. అదే ఒక గంభీరమైన శబ్ధ సంకేతాన్నే తీసుకోండి-అదొక సంగీత లయగా మారి పరాకుగా ఉన్న వారిని కూడా మంచి భావనకి లోనుచేస్తుంది. తన స్వరప్రస్థానం వెంట నడిపించుకుపోతుంది. ఈ అద్భుతాన్నే మనం ఇప్పుడు స్వరకళగా ఆస్వాదిస్తున్నాం. ఈ రంగం ఇప్పుడు పలు శాఖలుగా వర్ధిల్లుతోంది. ఎందరికో ఉపాధి అవకాశాలను అందిస్తోంది. శబ్దానికి ఉన్న శక్తి ఎంతటిదో మన ముందుటి రేడియో తరాన్ని కదిలిస్తే కమ్మని కథలుగా చెబుతారు. అప్పట్లో ప్రతి ఆదివారం మధ్యాన్నం రేడియోలో వచ్చే నాటకం వినడానికి చెవులు చేటంత చేసుకుని కూర్చునే వారు. నాటకం మొదలు అయ్యాకా ఇక కదిలితే ఒట్టు. చివరి అంకం పూర్తి అయ్యే వరకూ ఏకదీక్షగా ఆస్వాదించేవారు. ఆ నాటకం ఎంత గొప్పగా ఉండేదంటే ఎదురుగా రంగస్ధలం మీద నాటకం చూసినంత అనుభూతి కలిగేది. ఆ రేడియో నాటకంలో పాల్గొన్నవారు కనిపించకుండానే కేవలం తమ గళాలతో సృష్టించే అద్భుతం అది. అదన్నమాట స్వరకళ మహత్తు. రేడియో వ్యాఖ్యాత ఉషశ్రీ గారి గొంతు అయితే ఒక్కసారి వింటే చాలు- ఎప్పటికీ మరువలేరు. ఆయన చెప్పిన పురాణ కథా ప్రవాహంలో మునిగి తేలిన శ్రోతలు అసంఖ్యాకం. ఆయన రేడియో వ్యాఖ్యానం మొదలైతే ప్రతి మాటా లయబద్ధంగా మారి అందరినీ అదోలోకంలో ఓలలాడించేది అప్పట్లో. ఆ రోజుల్లో టెస్టు క్రికెట్ కి విపరీతమైన క్రేజ్ ఉండేది. ఇప్పటిలా దృశ్యమాధ్యమాలు లేని రోజులవి. అందువల్ల అందరూ క్రికెట్ సీజన్ లో రేడియోలకి ఇట్టే అతుక్కుపోయేవారు. క్రికెట్ కామెంటరీ వింటూ నిజంగా గ్రౌండ్ లో ఉండీ మ్యాచ్ చూస్తున్నంత భావోద్వేగానికి గురయ్యేవారు. ఇది కూడా రేడియోలో ఆ రోజుల్లో వ్యాఖ్యానం చెప్పే కామెంటేటర్ల గొప్పతనమే అనడంలో ఎటువంటి సందేహం లేదు. గ్రౌండ్ లో ఏం జరుగుతుందో ఆ దృశ్యం కళ్ళకు కట్టించేవారంటే నమ్మండి. తొంభైల తర్వాత పరిస్థితి మారిందనుకోండి. శాటిలైట్ సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. తొలుత దూరదర్శన్ వంటి ప్రభుత్వ ఛానెళ్లు, ఆ తర్వాత వందలాదిగా ప్రైవేటు టీవీ చానెళ్లు మొదలయ్యాయి. మార్కెట్లోకి ఆండ్రాయిడ్ ఫోన్లు వచ్చాకా విజువల్ మీడియా పెను మార్పులు వచ్చాయి. కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటివి ఇంటింటా తప్పనిసరయ్యాయి. దీనికి అనుబంధంగా సోషల్ మీడియా అవతరించింది. ఈ నేపథ్యంలో 'వాయిస్ ఓవర్' అనే అద్భుతకళ మీడియాని కొత్త పుంతలు తొక్కించింది. ఫలితంగా వాయిస్ ఓవర్ ఎందరికో ఉపాధిని కల్పించే గొప్ప సాధనమైంది. కరోనా అనంతర కాలంలో ఓటీటీ రంగం విస్తరించడంతో డబ్బింగ్ ఆర్టిస్టుల ప్రాముఖ్యత పెరిగింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఎంటర్టైన్ మెంట్ రంగం వాయిస్ ఓవర్ కళాకారులకి ఇప్పుడు రెడ్ కార్పెట్ పరుస్తోందనే చెప్పాలి. వాయిస్ రికార్డింగ్ సాంకేతికత, మైక్ వంటి పరికరాల వాడకం పెరిగింది. వాటిని ఎలా ఉపయోగించాలో చెప్పే యూట్యూబ్ వీడియోలు, ఆన్లైన్ పాఠాలు కోకొల్లాలు. దీంతో కొద్దిపాటి అక్షర జ్ఞానం ఉన్నవారు కూడా సులభంగా నేర్చేసుకోవచ్చు. ఆసక్తి ఉంటే, అభ్యాసం చేయగలిగితే చాలు-వాయిస్ రికార్డింగ్ మీకు వచ్చేసినట్టే. వాయిస్ ఓవర్, డబ్బింగ్ వంటి రంగాలలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు ఎందరో. దీనికంటూ ప్రత్యేకమైన కోర్సులు లేవు. కానీ, మాస్ కమ్యూనికేషన్స్ లేదా యాక్టింగ్ కోర్సులు చేసినవారికి ఇది వెన్నతో పెట్టిన విద్యే. డబ్బింగ్ కి మాత్రం కోర్సు ఉంది, దానిలో శిక్షణ పొందితే వాయిస్ ఓవర్ గురించి కూడా చక్కని అవగాహన ఏర్పడుతుంది. ఇటీవల వాయిస్ ఓవర్ ఆర్టిస్టులకి డిమాండ్ పెరగడంతో కొన్ని సైట్లు "సర్టిఫికెట్ కోర్సులు" మొదలుపెట్టాయి. అందులో వాయిస్ మెరుగు పరుచుకునే నైపుణ్యాలతోపాటు వాయిస్ రికార్డింగ్ సాంకేతికత గురించి సైతం కొన్ని మెళకువలు నేర్పుతున్నాయి. వాయిస్ ఓవర్ ఆర్టిస్టులకి శ్రావ్యత కలిగిన గొంతు ఉండీ, వాచకాన్ని సందర్భశుద్ధితో ప్రెజెంట్ చేయగలిగే నైపుణ్యం ఉంటే చాలు-అవకాశాలు మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తున్నాయి. వాయిస్ ఓవర్ సేవలను అందించడానికే సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు అనేక సైట్లు పుట్టుకువచ్చాయి. వాటిని శోధించి చూస్తే ఇట్టే అర్ధమవుతుంది స్వరకళకి నేడు పెరుగుతున్న డిమాండ్ ఏ స్థాయిలో ఉందో. కార్టూన్లు, వీడియో గేమ్లు, ఈ-లెర్నింగ్ వీడియోలు, ఆడియో పుస్తకాలు, కమర్షియల్ యాడ్స్, డబ్బింగ్, గూగుల్ ప్రకటనలు, టీవీ-రేడియో ప్రకటనలు, పోడ్ కాస్టింగ్, ప్రీ స్కూల్ కంటెంట్, రేడియో జింగిల్స్, టీవీ, యూట్యూబ్ చానెళ్లు వంటి పలు శాఖలు ఇప్పుడు వాయిస్ ఓవర్ అవకాశాలకి ప్రధాన వేదికలుగా ఉన్నాయి. "గాత్ర ప్రతిభావంతుల కోసం మీరు ఎదురు చూస్తున్నారా? మీ స్క్రిప్టుకి జీవం పోసి, మీ కథనాన్ని రక్తి కట్టించే వాయిస్ ఓవర్ కళాకారుల గురించి అన్వేషిస్తున్నారా? మీకు అవసరమైన మగ, ఆడ, బాల వాయిస్ ఓవర్ ఆర్టిస్టులు మా దగ్గర సిద్ధంగా ఉన్నారు. మమ్మల్ని సంప్రదిస్తే మీకు గాత్ర నటుల సేవలు అందిస్తాం" అంటూ అనేక సైట్లు ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తున్నాయి. తమ టీంలో ఉన్న వాయిస్ కళాకారుల ప్రతిభా విశేషాలతో కూడిన వివరాలను ప్రముఖంగా ప్రచారం చేస్తున్నాయి. ఈ పరిణామం అంతా కూడా డిజిటల్ మీడియా వెలుగుల ఫలితమే అనవచ్చు. అక్షరాలు, వత్తులు, దీర్ఘాలు, పొల్లులు వంటివి అన్వయ సహితంగా పలికితేనే ఏ పదం అయినా అర్ధవంతంగా మారుతుంది. సరిగా ఉచ్ఛరించకపోతే భాషకి జీవం పోతుంది. అంతే కాదు- స్థానిక పలుకుబడులు, మాండలీక ధ్వనులు స్పష్టంగా పలకడం రావాలి. అప్పుడే శబ్ధపరంగా, వ్యాకరణపరంగా భాషా నుడికారం అర్ధమౌతుంది. భాషా నైపుణ్యం కలిగిన అనుభవజ్ఞులైన వాయిస్ ఓవర్ కళాకారులకు మాత్రమే ఇది సాధ్యం. సాధనమున పనులు సమకూరు ధరలోన అన్నాడు వేమన. సాధనతోనే కదా ఏదైనా సాధ్యపడేది. ఇది కూడా అంతే. గాత్ర శుద్ధి కలిగినవారికి సహజంగానే ఈ మధ్య కాలంలో మంచి అవకాశాలు వస్తున్నాయి. అందుకు తగ్గట్టే ఆదాయమూ ఉంటోంది. ఉదాహరణకి యావరేజ్ గా వాయిస్ ఓవర్ చేసేవారికి నెలకి కనీసం పాతిక వేల రూపాయల ఇన్కమ్ వస్తోంది. వాక్ శుద్ధి కలిగి ధాటీగా వాయిస్ చెప్పగలిగే ఆర్టిస్టులు నెలకి లక్ష రూపాయల కంటే ఎక్కువే సంపాదిస్తున్నారనడంలో అతిశయోక్తి కాదు. టీవీ చానెళ్లలో రెగ్యులర్ ఉద్యోగాలు చేసేవారు ఇప్పుడు అనేక మంది ఉన్నారు. ఫ్రీలాన్సర్ గా ఉంటూ ఇటు టీవీలకు, అటు సినిమాలకు డబ్బింగ్ చెప్తూ రాణిస్తున్న వాయిస్ ఓవర్ కళాకారులు మరెందరో.



( ఎం.మధురవాణి )
(పరిశోధక విద్యార్ధి,
ఆచార్య నాగార్జున
విశ్వవిద్యాలయం )
ఫోన్: 9849375322)